ప్రజాశక్తి
శుక్రవారం 7, ఏప్రిల్ 2023



వలసల నివారణకే 'ఉపాధి'

ప్రజాశక్తి-బత్తలపల్లి

వలసల నివారణ కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తున్నట్లు డ్వామా పీడీ రామాంజనేయులు తెలిపారు. 'అమృత్ సరోవర్' పనులోల భాగంగా గురువారం మండలంలోని ఈదుల ముష్టురు గ్రామంలో చేపట్టిన చెరువులో పూడికతీత పనులను ఏపీఓ ఆదెప్పతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి 31వ తేదీ వరకు కూలీలకు రావాల్సిన వేతనాలను ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. ఈ వేసవి కాలం నుంచి రూ.257 నుంచి రూ.272 వరకు కనీస వేతనాన్ని పెంచినట్లు తెలిపారు. జాబ్‌కార్డు పొందిన ప్రతి కూలీకి పనులు కల్పిస్తామన్నారు. కూలీలెవరూ వలసలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. వారి వెంట జెఇ.నాగార్జున, టెక్నికల్ అసిస్టెంట్ హేమావతి, ఫీల్డ్ అసిస్టెంట్ ఓబులేసు తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఏపీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కుంబా రవిబాబు

విద్యార్థిని మృతిపై ఎస్టీ కమిషన్ విచారణ

మృతికి కారకులపై ఎస్టీ అట్రాసిటి కేసు నమోదుకు సిఫార్సు

బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటాం

ఏపీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కుంబా రవిబాబు

ప్రజాశక్తి-చిలమత్తూరు

లేపాక్షి మండలం టేకులోడు గురుకులంలో గత నెల 29వ తేదీన 8వ తరగతి చదువుతున్న విధ్యార్థిని మహిత మృతిపై ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కుంబా రవిబాబు పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో స్థానిక మహాత్మ జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల వసతి గృహంలో గురువారం విచారణ చేపట్టారు. విచారణ సందర్భంగా అనేక విషయాలు బట్టబయలు కావడంతో ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కుంబా రవిబాబు అధికారుల తీరుపై మండిపడ్డాడు. మొదట గురుకుల సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులను విచారించారు. కమిషన్ వేసిన ప్రశ్నలకు సిబ్బంది సమాధానం ఇవ్వలేకపోయారు. విద్యార్థిని మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. విచారణ అనంతరం కుంబా రవిబాబు మీడియాకు పలు విషయాలను వెల్లడించారు. అనారోగ్యం పాలైన విద్యార్థిని పట్ల ఎఎన్‌ఎం, క్లాస్ ఇన్‌ఛార్జి నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అలాగే పీఈటీ అనారోగ్యంతో ఉన్న విద్యార్థినితో మైదానంలో రౌండ్‌లు కొట్టించి బాలిక అరోగ్యం మరింత క్షీణించడానికి కారణం అయిందన్నారు. 19వ తేదీ అనారోగ్యం పాలైన విద్యార్థినికి అదే రోజు తల్లిదండ్రులు ఆసుపత్రిలో చికిత్స చేయించి హాస్టల్‌లో వదిలారన్నారు. ఆ రోజు నుండి 28వ తేదీ వరకు ఎలాంటి పర్యవేక్షణ లేదన్నారు. సిక్ రిజిస్టర్‌లో కూడా ఎంట్రీ లేదన్నారు. హాస్టల్ విద్యార్థినులు అనారోగ్యం పాలైతే ఆసుపత్రిలో చూపించాలన్నారు. అయితే ఆసుపత్రిలో చూపించకుండా విద్యార్థినిని ఇంటికి పంపడం ఉద్యోగం పట్ల సిబ్బందికి ఉన్న బాధ్యత ఎలా ఉందో స్పష్టం అవుతోందని అన్నారు. ఆ విద్యార్థినితో మరో 20 మంది విద్యార్థినులు అనారోగ్యం పాలయ్యారని మెడికల్ ఆఫీసర్ హస్టల్‌కి వచ్చి పరిశీలించేంత వరకు ఇది బయటపడలేదన్నారు. క్లాస్ ఇన్‌ఛార్జి విద్యార్థినుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో స్పష్టం అయిందన్నారు. విద్యార్థిని అనారోగ్యం పాలయినా కనీసం ప్రిన్సిపల్ దృష్టికి తీసుకుపోకుండా నిర్లక్ష్యంగా వహించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రిన్సిపల్ బాధ్యతా రాహిత్యం కూడా ఉన్నట్లు స్పష్టమైందన్నారు. ఇవన్నీ ఓ గిరిజన విద్యార్థిని మృతికి కారణం అయ్యాయని వెల్లడించారు. విద్యార్థిని మృతి అనంతరం కూడా సిబ్బంది, అధికారులు దారుణంగా వ్యవహరించారని అన్నారు. విద్యార్థిని మృతి అనంతరం చోటు చేసుకున్న పరిణామాలతో పలువురు బాధ్యులుగా తేలారని చెప్పారు. ఓ గిరిజన విద్యార్థిని మరణిస్తే విచారణ చేయకపోవడం, కేసు నమోదు కాకపోవడం దేనికి సంకేతం అన్నారు. గురుకులాల ఏజీవో రాజేంద్ర కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ విద్యార్థిని తల్లిదండ్రులకు రూ.50 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకుంటే, సొసైటీ సెక్రటరీ విద్యార్థిని తండ్రికి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం ఆశచూపి అట్రాసిటీ కేసు నమోదు కాకుండా జాగ్రత్తపడ్డారని విచారణలో తేలిందన్నారు. ఆసుపత్రిలో ఎమ్‌ఎల్‌సి చేయకుండా, పోస్టుమార్టం చేస్తే విషయాలు బయటకు వస్తాయని మేనేజ్ చేశారన్నారు. పోస్టుమార్టం చేయని ఆసుపత్రి డాక్టర్‌ను కూడా బాధ్యుడిగా చేర్చాలని ఆదేశించారు. విద్యార్థిని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం చేయించాలని, మృతికి గల కారణాలపై నిగ్గుతేల్చాలని, కారకులైన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్‌కు సిఫార్సు చేశారు. విద్యార్థిని కుటుంబానికి రూ.8.50 లక్షలు నష్టపరిహారం, 2 ఎకరాల భూమి, తల్లి లేదా తండ్రికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి నిర్మాణానికి స్థలం కేటాయించాలని అన్నారు. ఇవన్నీ అమలయ్యేలా చూడాలని సబ్ కలెక్టర్ కార్తీక్‌ను ఆదేశించారు. విద్యార్థిని మృతికి కారణం అయిన వారిని సస్పెండ్ చేయాలని సూచించారు. దీనిపై కలెక్టర్, ఎస్పీ ప్రత్యేక చొరవ ఎందుకు చూపలేకపోయారో సమాధానం చెప్పాలన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ విద్యార్థిని మృతికి కారకులైన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేస్తామన్నారు. వారి కుటుంబానికి ప్రభుత్వం నిబంధనల మేరకు న్యాయం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్, సిఐ వేణుగోపాల్, డాక్టర్ రామకృష్ణ, విద్యార్థిని తల్లిదండ్రులు రమణ, రమాదేవి, విద్యార్థి సంఘాల నాయకులు బాబావలి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగభూషణ, గిరిజన సంఘాల నాయకులు శంకరయ్య, ఎన్ రవీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

చల్లగా..చంపేస్తుంది..!

ఐస్..ఐస్..వేసవి వచ్చిందంటే దీన్ని తలచని మనిషే ఉండడు. ఎండ తాపం నుంచి బయటపడేందుకు ఎక్కువ మంది ఐస్‌ను ఆశ్రయిస్తుంటారు. ఏది తాగాలన్నా.. తినాలన్నా.. చల్లని ఐస్ లేనిదే గొంతులో దిగదు. రోడ్డు మీద కనిపించే షరబత్ బండి మొదలు పెద్ద పెద్ద రెస్టారెంట్లలోని జ్యూస్ షాపుల వరకూ చివరకి పాలతో చేసిన మజ్జిగ, లస్సీ వంటివి తాగాలన్నా అందులో ఐస్ వేయాల్సిందే. పేద ధనిక అన్న తేడా లేకుండా అంతా ఐస్ తాగుతుంటారు. అలాంటి ఐస్ ఎలా తయారవుతుంది.. చల్లని ఐస్‌లో ఏముంది.. ఈ విషయాలు తెలుసుకోనేందుకు ప్రజాశక్తి పరిశీలన చేసింది..

కలుషిత నీటితో ఐస్ తయారీ

తుప్పు పట్టిన డబ్బాల్లో నిల్వ

రోగాల బారిన జనం

పట్టించుకోని అధికార గణం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని రహమత్‌పురం సర్కిల్, పరిగి రోడ్డు, హస్నాబాద్, డిబి కాలనీ, మోడల్ కాలనీ, పరిగి రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉన్న ఐస్ తయారీ కేంద్రాలను ప్రజాశక్తి గురువారం పరిశీలించింది. ఇందులో ఎవరూ ఊహించని నిజాలు బయట పడ్డాయి. అక్కడ అటోల్లో, సైకిళ్లలో వచ్చి ఐస్ కొనుక్కుంటున్న వారితో వివరాలు తెలుసుకుని ఐస్ ఫ్యాక్టరీని పరిశీలించింది.

కలుషిత నీరే ఐస్..

ఐస్ దిమ్మలు తయారు చేసేందుకు వాడే నీరంతా కలుషితమే. అదే నీటిని తుప్పు పట్టిన ఇనుప డబ్బాల్లో పెట్టి, ఒక పెద్ద ట్యాంకులో దించారు. ఆ ట్యాంకులో శుభ్రం చేయని నీరు ఉంది. అది ఉప్పు కలపబడిన మురుగు నీరు. ఇందులో ఐస్ తయారీ చేస్తున్నారు. తయారైన ఐస్‌ను మళ్లీ కలుషిత నీటిలోకి వేసి ఐస్ గడ్డలను బయటకు తీస్తున్నారు. ఇలా తయారు చేసిన ఐస్‌ను ముక్కలుగా చేసి షరబత్, మజ్జిగ, లస్సీ, పెద్ద పెద్ద రెస్టారెంట్లు, జ్యూస్ సెంటర్లకు సరఫరా చేస్తున్నారు. హిందూపురం పట్టణం అంతా ఇదే పరిస్థితి ఉంది.



కలుషిత నీటిలో కూలింగ్ కోసం ఉంచిన పుల్ల ఐస్



స్థానికంగా తయారు చేసిన ఐస్‌లు

ఐస్ ఫ్యాక్టరీలు రెండు రకాలు..

ఐస్ ఫ్యాక్టరీలు రెండు రకాలు. ఒకటి స్టోరేజి కోసం వినియోగించే ఐస్. దీంతో చేపలు, మాంసం తదితర వాటి నిల్వల కోసం వాడుతారు. ఇదే ఐస్‌ను శవ పేటిల్లో కుడా వాడుతారు. రెండోది ప్రజలు శీతల పానీయాల్లో కలుపుకుని తాగేది. అయితే పట్టణంలో అన్నింటికీ ఇదే ఐస్‌ను వాడుతున్నట్లు సమాచారం. రోజుల తరబడి ఒకే నీటినే వినియోగిస్తూ.. నీటిని మార్చకపోవడంతో ప్రమాదకర వైరస్ మనిషిని రోగాల బారిన పడేస్తుందని వైదులు పేర్కొంటున్నారు.

హిందూపురం పట్టణంలో సుమారు 1.70 లక్షల మంది జనాభా ఉన్నారు. వీరితో పాటు వివిధ పనుల నిమిత్తం వివిధ ప్రాంతాల నుండి వేలాది మంది పట్టణానికి వస్తుంటారు. ఇందులో ఏదో ఒక రూపంలో దాదాపు 70 శాతానికి పైగా ఐస్‌ను వాడతారు. జిల్లాలో ప్రతి మండలం. డివిజన్ కేంద్రాల్లో ఐస్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటి ద్వారా రోజూ ఒక్కో ఫ్యాక్టరీలో వేలాది రూపాయల ఐస్‌ను విక్రయిస్తున్నారు. వ్యాపారులకు రూ.వేలు తెచ్చి పెట్టే ఐస్ ఫ్యాక్టరీలు ప్రజల ఆరోగ్యాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి.



ఐస్ గడ్డలను మురికి నీటిలో వేసి బయటకు తీస్తున్న దృశ్యం

స్టోరేజ్ ఐస్‌తో ప్రమాదం

స్టోరేజ్ కోసం వినియోగించే ఐస్ వల్ల ఆరోగ్యం దెబ్బతింటుంది. కలుషిత నీటితో ఐస్ తయారు కావడంతో వేగంగా గొంతు ఇన్‌ఫెక్షన్‌కు గురవుతారు. శ్వాసకు సంబంధించిన వ్యాధులు ఉన్న వారు ఐస్‌ను వాడరాదు. శుద్ధ జలంతోనే ఐస్ తయారుచేయాలి. లేదంటే ప్రజల ఆరోగ్యాలు తీవ్రంగా దెబ్బతింటాయి. ఐస్‌తో అప్రమత్తం అవసరం.

– వెంకటరమణ నాయక్, వైద్యులు



జగన్ ప్రభుత్వంలో బిసిలకు అన్యాయం

వైసిపిని సాగనంపితే తప్ప రాష్ట్రం బాగుపడదు

యువగళం పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి- అనంపురం కలెక్టరేట్

రాష్ట్రంలో బిసిలు తీవ్ర వెనకబాటుకు గురువుతున్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో అన్యాయం జరుగుతోందని, వెనుకబడిన వర్గాలు, కులాలకు తెలుగుదేశం పార్టీ హయాంలోనే న్యాయం జరిగిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. లోకేష్ యువగళం పాదయాత్ర 62వ రోజు కూడేరు నుంచి కమ్మూరు మీదుగా కోటంక, మర్తాడుకు చేరుకుంది. కమ్మూరులో బిసి సామాజికవర్గం ప్రతినిధులతో నిర్వహించిన ముఖాముఖిలో లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నేడు బిసిల పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. వైసిపి ప్రభుత్వం బిసిలకు అన్యాయం చేస్తోందన్నారు. బిసిలపై అక్రమ కేసులు బనాయించి భయాందోళనలకు గురిచేస్తోందని దుయ్యబట్టారు. బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ రావడంలేదన్నారు. విదేశీ విద్య పథకాన్ని కూడా ఆపేశారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్స్ పథకాన్ని భ్రష్టు పట్టించారని తెలిపారు. బీసీ రెసిడెన్షియల్ హాస్టల్స్, కాలేజీలు ఏర్పాటు చేయలేదన్నారు. ఈడిగ కులస్తులను ప్రభుత్వం వేధిస్తోందన్నారు. బోయ కులస్తులకు ఎటువంటి సహాయం అందడం లేదన్నారు. పేరుకే కార్పొరేషన్‌లు ఉన్నాయన్నారు. ఒక్క రూపాయి రుణం ఇవ్వలేదన్నారు. విద్యా దీవెన, వసతి దీవెన వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. బటన్ నొక్కినా తల్లిదండ్రుల ఖాతాలో డబ్బులు పడటం లేదన్నారు. బిసిలకు టిడిపితోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. టిడిపి ప్రభుత్వం రాగానే వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తామన్నారు. సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పునరుద్ధరిస్తామన్నారు. బిసి ఉప కులాలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈడిగ కులస్తులను ప్రోత్సహించింది టిడిపినే అన్నారు. ఆదరణ పథకం ద్వారా పనిముట్లు అందించామని, జగన్ సొంత మద్యం వ్యాపారం కోసం కల్లుగీత కార్మికులను వేధిస్తున్నాడని విమర్శించారు. మృతి చెందిన, గాయపడిన ఒక్క కల్లుగీత కార్మికుడి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోలేదన్నారు. 26 వేల మంది బిసిలపై కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేశారన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే చంద్రన్న బీమాని ఇంకా పటిష్టంగా అమలు చేస్తామన్నారు. జగన్‌కి బీసీలంటే ప్రేమ లేదని, అందుకే డమ్మీ కార్పొరేషన్‌లు పెట్టారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే దామాషా ప్రకారం బీసీ ఉపకులాలకు నిధులు కేటాయిస్తామన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పరిపాలన అందిస్తామని హామీ ఇచ్చారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీల రక్షణ చట్టం తీసుకొస్తామని, న్యాయ పోరాటానికి అయ్యే ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. నియోజకవర్గాల వారీగా బిసిలకు రెసిడెన్షియల్ కళాశాలలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్రలో ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాదయాత్రలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్



నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఇసుక అక్రమ తరలింపును ఆపాలి

ప్రజాశక్తి - పరిగి

నిబంధనలు గాలికి వదిలి జేపీ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ కంపెనీ వ్యక్తులు పరిగి జయ మంగలి నుండి చేపట్టిన ఇసుక అక్రమ తరలింపును ఆపాలని వైసిపి మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం ఇసుక తరలింపు స్థలం వద్ద ఆందోళన చేశారు. జిల్లా ఉన్నతాధికారులకు ఇచ్చిన ఆదేశాలను సైతం పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటాయించిన స్థలంలో కాకుండా మరోచోట ఇసుకను తోడుతున్నారని అన్నారు.. ఈ విషయాన్ని పలుమార్లు చెప్పినా నిలుపుదల చేయకపోవడం ప్రజా వ్యతిరేక విధానమైననే మండల నాయకుడు ప్రభాకర్ విమర్శించారు. దీనిపై న్యాయవ్యవస్థను ఆశ్రయించి పూర్తిస్థాయిలో నిలుపుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. గతంలో తమ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేదని అన్నారు. వర్షాలు బాగా కురవడం, తమ ప్రాంతంలో పెన్నా, జయమంగళీ నదులు పుష్కలంగా ప్రవహించడం వల్ల ప్రస్తుతం భూగర్భ జలాలు పెరిగాయన్నారు. అయితే ఉన్న ఇసుకను ప్రైవేట్ కంపెనీ వారు తరలిస్తే తమకు తిరిగి నీటి ఎద్దడి ఎదురవుతుందని అన్నారు. మండలంలోని ప్రజల ప్రయోజనాల కోసం ఎంతవరకైనా పోరాడుతామని అన్నారు. టిప్పర్లను, హిటాచిలను నది తీరం దాటిస్తామని హెచ్చరించారు. వెంటనే జిల్లా స్థాయి అధికారులు గుర్తించి ఇసుక రీచ్‌ను వెంటనే నిలుపుదల చేయాలని కోరారు. అనంతరం ఇసుక రిచ్ వద్దకు వెళ్లి అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో పెనుగొండ సిఐ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు నాయకులను హిందూపురం రూరల్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్టు అనంతరం సిఐ కరుణాకర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే అరెస్టు చేస్తున్నామని చెప్పారు. జెపి కన్స్ట్రక్షన్ వారు ఉన్నతాధికారుల ఆదేశాలతోనే ఈ ఇసుక తరలింపును కొనసాగిస్తున్నారని ప్రజలు దీన్ని గుర్తించాలని చెప్పారు. అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే కేసులు పెట్టాల్సి వస్తుందనిహెచ్చరించారు. ఇసుక తరలింపు పక్రియను ఆరుగురు ఎస్ఐలు, ముగ్గురు సిఐలు, 110 మంది కానిస్టేబుళ్ల పహారాలో నిర్వహిస్తుండటం గమనార్హం.

పొలానికి దారి మూసివేత

దారి ఏర్పాటు చేయాలని రైతుల ఆందోళన

ప్రజాశక్తి-నంబులపూలకుంట

పొలానికి వెళ్లే దారిని కొందరు అకారణంగా మూసి వేశారని, దీనికి సంబంధించి అధికారులు స్పందించి దారిని పునరుద్ధరించాలని రైతులు కోరారు. ఈ మేరకు గురువారం ఉదయం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మండల పరిధిలో మర్రికొమ్మదిన్నె పంచాయతీ జోకుల గ్రామం సర్వే నంబర్ 105, సమీప పొలాలకు వెళ్లే దారిని ఇటీవల కొందరు మూసి వేశారన్నారు. ఈ విషయాన్ని తహశీల్దార్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా, ఫలితం లేదన్నారు. దారిని పునరుద్ధరంచకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. రైతుల ఆందోళనకు రైతు సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకుడు నాగిరెడ్డి, రైతులు వేమారెడ్డి, రాజారెడ్డి, నరసింహారెడ్డి, నాగరాజు, భయ్యారెడ్డి, గంగాదేవి, సూర్యనారాయణ, నిర్మల పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న రైతులు, నాయకులు

కార్యకర్తల కోసం జైలుకెళ్లడానికైనా సిద్ధం : పల్లె


ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

పార్టీని, తనను నమ్ముకున్న ప్రజలు, కార్యకర్తల కోసం పార్టీ కోసం జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధమేనని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి సవాలు విసిరారన్నారు. ఆ సవాలను తాము స్వీకరిస్తూ అభివృద్ధిపై చర్చకు వెళ్లాలని నిర్ణయించుకున్నామన్నారు. దీనిపైన పోలీస్ 30 యాక్ట్ అమలులోకి తెచ్చారన్నారు. 30 యాక్ట్ ఉండడం వల్ల పోలీసులు తనను, మాకార్యకర్తలను పార్టీ ఆఫీసు నుంచి బయటకు రానివ్వలేదన్నారు. అయితే ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డికి కూడా ఈ యాక్ట్‌ను పోలీసులు వర్తింపజేయాలన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తమ పార్టీ ఆఫీస్ ముందుగా వెళుతూ తమకార్యకర్తలను అవమానించే విధంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని, వారి కార్యకర్తలు కేకలు వేసుకుంటూ వెళ్లారని అన్నారు. అందువల్లేనే ఆము సత్యమ్మ గుడి సర్కిల్ కి వెళ్లాల్సి వచ్చిందనిఆ సమయంలో తనతో పాటు అనుచరులు ఐదు మంది మాత్రమే ఉన్నామన్నారు. సత్యమ్మ గుడి సర్కిల్ లో వైసీపీ కార్యకర్తలు తనపై దాడికి పాల్పడ్డారని చెప్పారు. అయితే ఈ సంఘటనకు బాధ్యులుగా ఇరువర్గాల పైన కేసులు పెట్టాలన్నారు. పోలీసులు అందుకు భిన్నంగా తన ఒక్కడిపైనే నాలుగు కేసులు నమోదు చేశారని ఇది పోలీసులకు ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. సిసి ఫుటేజ్ లు వీడియోలు చూసి తనపై కేసు నమోదు చేయాలని అన్నారు. తనపై ఎన్ని కేసులు పెట్టిన ఎదుర్కొంటానని అయితే నిరాధారమైన కేసులు పెడితే ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. తమ పార్టీ కార్యకర్తలు సుధీర్, మణి, మరి కొందరికి తీవ్రంగా దెబ్బలు తగిలాయని వారు కేసు పెడితే పోలీసులు ఇంతవరకు కేసు నమోదు చేయలేదని విమర్శించారు. ఆరోజు జరిగిన సంఘటనలో తమ పార్టీ నాయకులైన కొందరు పుట్టపర్తిలో లేకపోయినా వారి పైన కూడా కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు సామకోటి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు చేస్తే సహించం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

తప్పుడు ఆరోపణలతో తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా ఆరోపణలు చేసి బురదజల్లాలని చూస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి టీడీపీ నాయకులు నారా లోకేష్, పరిటాల శ్రీరామ్‌పై ఆగ్రహం వ్యకం చేశారు. ఈ మేరకు ఆయన తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ధర్మవరం మండలంలో తాను కొనుగోలు చేసిన ఫాం హౌస్ కు సంబంధించి చెరువు స్థలాన్ని కబ్జా చేశానని పక్క వాడి భూమును కూడా గూగుల్ మ్యాప్లో చిత్రీకరించి నారా లోకేష్ చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని అన్నారు. నారా లోకేష్ ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదవడం వలన మరింత విలువలు దిగజారి ప్రవర్తిస్తున్నారన్నారు. ఈ విషయంలో ఏ విచారణకైన తాను సిద్ధమని అన్నారు. తాను చెప్పింది నిజమైతే మీరు రాజకీయాల నుండి తప్పుకుంటారా..? అని ప్రశ్నించారు. ఒక వేళ తనదే అబద్ధమని తేలితే తాను ఎమ్మెల్యే పదవికి తక్షణం రాజీనామా చేసి ఏ విచారణరైన సిద్ధమేనని సవాల్ విసిరారు. పాదయాత్రలో ప్రజలకు ఏం మంచి చేస్తారో చెప్పాల్సింది పోయి ఇలా బురదజల్లుడు రాజకీయాలు చేస్తూ పోతే వారికి మనుగడ ఉండదని హెచ్చరించారు. నిరాధార ఆరోపణలు చేసిన నారా లోకేష్, పరిటాల శ్రీరామ్‌తో పాటు ఎల్లో మీడియాపై పరువు నష్టం దావా వేస్తానని ఎమ్మెల్యే అన్నారు.



ఆధారాలు చూపుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

రోడ్డు, బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని నిరసన

లేపాక్షి : నూతన రోడ్డు, బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతూ మండల పరిధిలోని గలిబిపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ సమస్యపై గురువారం ఉదయం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుంచి రోడ్డు వేయాలని కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. రోడ్డు లేకపోవడంతో గ్రామస్తులు, పిల్లలు, వృద్ధులు, మహిళలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తక్షణం ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామస్తుల ఆందోళన విషయం తెలుసుకున్న తహశీల్దార్ బాబు సంఘటన స్థలానికి చేరుకుని వారితో మాట్లాడారు. జాతీయ రహదారి అధికారులతో మాట్లాడి రెండు వారాల్లోపు బస్సు షెల్టర్ నిర్మిస్తామన్నారు. రహదారి పనులను కూడా వారం రోజుల్లోపు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. తహశీల్దార్ హామీతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఆదినారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుపై 5 శాతం రాయితీ

కదిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం 2023-24 సంవత్సరానికి ముందస్తు ఇంటి పన్ను చెల్లింపులో ఐదు శాతం రాయితీ కల్పిస్తున్నట్లు కదిరి మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ఇంటి పన్ను చెల్లించిన వారికి ఇంటి పన్నుపై ఐదు శాతం రాయితీ కల్పిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకుని మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

విఆర్‌కు మడకశిర ఎస్ఐ నాగేంద్ర

మడకశిర : మడకశిర పట్టణ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నాగేంద్రను విఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన స్థానంలో విఆర్‌లో ఉన్న సురేష్‌బాబును మడకశిర ఎస్ఐగా బదిలీ చేశారు. ఎస్ఐ నాగేంద్రపై వివిధ ఆరోపణలు రావడంతో జిల్లా పోలీస్ బాస్ ఆయన్ను విఆర్‌కు పంపినట్లు తెలుస్తోంది.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

కదిరి టౌన్ : కదిరి ఐసిడిఎస్ తూర్పు ప్రాజెక్టు నందు నాలుగు అంగన్‌వాడీ సహాయకుల ఖాళీల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఒ రాధిక గురువారం ప్రకటనలో తెలిపారు. ఐసిడిఎస్ పరిధిలో తనకల్లు మండలం ముత్యాలవాండ్ల పల్లి (ఎస్సీ), ఎర్రబల్లి (ఓసీ), నల్ల చెరువు మండలంలో బొమ్మిరెడ్డి పల్లి(ఓసీ), తలుపుల మండలం కొ్పూరువాండ్లపల్లి(బిసి-బి) ఖాళీలు ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు.

కన్నుల పండువగా దీపోత్సవం

సోమందేపల్లి : మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలో వెలసిన శ్రీమజ్జగంత రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అద్భుత దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ఉదయం ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్తంభం చిన్న దీపం ఉంచారు. పూజల అనంతరం దేవాలయం బయట ఉన్న మరో స్తంభంపై అది అద్భుత దీపాన్ని ఉంచారు. దీపోత్సవాన్ని తిలకించేందుకు మండలం నుంచే కాక కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవాలయ ఛైర్మన్ రమాకాంత్‌రెడ్డి, సర్పంచి గిరిజమ్మ నాగరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఆంజనేయునికి వడమాల సేవ

బత్తలపల్లి : హనుమజ్జయంతిని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి ఆకు పూజోత్సవం, వడమాలసేవలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆంజనేయస్వామికి, సీతారామ సమేత ఆంజనేయస్వామికి ఆకుపూజ, వడమాలసేవ, పుష్పసేవలు నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు సురేష్ ఆచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు ద్రాచ్చాయని, రుక్మిణీ, గోపీ తెలిపారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ధర్మవరం టౌన్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఉషోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ చాంద్‌బాషా అన్నారు. అంతర్జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా ధర్మవరం ఆర్డీటీ జూడో క్లబ్ ఆధ్వర్యంలో కొత్తపేట బాలికల ఉన్నతపాఠశాలలో గురువారం మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల సమీపంలో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జూడో కోచ్ ఇనాయత్ బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

బుక్కపట్నం : మండల పరిధిలోని బుచ్చయ్య గారి పల్లిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సురేంద్ర, సామకోటి ఈశ్వరయ్య, మల్లికార్జున, నారాయణస్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్య సేవలు

హిందూపురం : బుద్ధిమాంద్యం పిల్లలకు హిందూపురం జిల్లా ప్రభుత్వం అసుపత్రిలో ప్రత్యేక వైద్య సేవలను అందిస్తున్నట్లు మానసిక వైద్య నిపుణులు సురేష్‌కుమార్ తెలిపారు. ప్రపంచ బుద్ధి మాంద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అసుపత్రి ఆవరణంలో మానసిక వైద్య నిపుణులు సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి సీనియర్ నాయకుడు టిడిపిలో చేరిక

కనగానపల్లి : మండల పరిధిలోని వేపకుంట గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకుడు ఎరికెల వెంకటేష్ మాజీమంత్రి పరిటాల సునీత సమక్షంలో గురువారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సునీత ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ యాతం పోతలయ్య, వేపకుంట టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నిర్వాసిత రైతులతో సమావేశం

ప్రజాశకి - గోరంట్ల

మండల పరిధిలోని కదిరి నుండి హిందూపురం జాతీయ రహదారికి భూములు కోల్పోతున్న రైతులతో తహశీల్దార్ రంగనాయకులు గురువారం స్థానిక గ్రామ సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం ఇచ్చే పరిహారం గురించి వివరించారు. బోరుబావులున్న రైతులకు, పండ్లతోటలు ఉన్న రైతులకు పరిహారం ఎంతమేర వస్తుందో వివరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిరంకుశ పాలనపై పాదయాత్ర

ధర్మవరం టౌన్ : కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక, నిరంకుశ పాలనపై ఈనెల 14 నుంచి 31వతేదీ వరకు సిపిఐ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్, మతోన్మాద విధానాలను అవలంభిస్తోందన్నారు. ఈ సమావేశంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి జేవీ రమణ, చేనేత కార్మికసంఘం తాలూకా కార్యదర్శి వెంకటనారాయణ, నాయకులు వెంకటస్వామి, శ్రీదర్, సురేష్, రంగయ్య, ముదిగుబ్బ వెంకటేష్, ఆది, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సకలరాజ, కుళ్లాయప్ప, జిల్లా సహాయ కార్యదర్శి పోతలయ్య పాల్గొన్నారు.

తండ్రి మరణంలోనూ పది పరీక్షకు...

ప్రజాశక్తి - చిలమత్తూరు

తండ్రి గుండెపోటుతో మృతి చెంది దహన సంస్కారాలు కాక మునుపే కొండంత దుఖంతో ఆత్మ నిబ్బరంతో విద్యార్థిని పది పరీక్షకు హాజరైన విషాద ఘటన గురువారం చోటు చేసుకుంది. చిలమత్తూరు ఎస్సీ హాస్టల్ లో ప్రభుత్వ రెగ్యులర్ వంట మనిషిగా పని చేసే శంకరప్ప బుధవారం సాయంత్రం సమయంలో గుండె పోటుతో మృతి చెందాడు. శంకరప్ప స్వ గ్రామం కొడిగినహల్లి కాగా ఉద్యోగం చిలమత్తూరు హాస్టల్ లో చేస్తున్నారు. దీంతో కూతురిని చిలమత్తూరు హై స్కూల్ లో చేర్పించాడు. అయితే తండ్రి మృతిచెంది, ఆయన మృతదేహం ఇంటి ముందు ఉన్నా ఆత్మ స్థైర్యంతో విద్యార్థిని నిర్మల గురువారం పదో తరగతి ఆంగ్ల పరీక్షకు హాజరైంది. తండ్రి మృతితో కన్నీరు మున్నీరవుతున్న విద్యార్థినిని తోటి విద్యార్థినులు ఓదార్చే పయత్నం చేశారు. ఈ హదయ విదారక ఘటన తోటి విద్యార్థినులను కంటి తడిపెట్టించింది. పరీక్ష అనంతరం తమ సొంత గ్రామం కొడిగినహల్లిలో తండ్రి దహన సంస్కారాలలో విద్యార్థిని పాల్గొంది.



బాధిత విద్యార్థిని ఓదారుస్తున్న తోటి విద్యార్థిని

ప్రతి పేదకుటుంబానికీ ఉచిత వైద్యసేవలు



వైద్యసేవలపై చర్చిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్



వైద్యసేవల గురించి వివరిస్తున్న వైద్యాధికారి

పెనుకొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన కుటుంబ వైద్యుడు (ఫ్యామిలీ ఫిజీషియన్) కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్, పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని వెంకటగిరి పాళ్యం గ్రామంలో వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ లో నిర్వహించిన కుటుంబ వైద్యుల విధానం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. బసంత్ కుమార్, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్యే శంకర నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా ప్రజలకు అందే వైద్యసేవల గురించి వివరించారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఎస్‌వి. కృష్ణారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలంలోని లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొడిపల్లి ఆరోగ్య ఉపకేంద్రంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని మండల వైద్యాధికారి డాక్టర్ రాజకుమార్ గురువారం ప్రారంభించారు. 104 వాహనం ద్వారా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ కుటుంబ డాక్టర్ విధానం ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే ఆరోగ్య వైద్యసేవలు అందుతాయని తెలిపారు. ప్రతి పిహెచ్‌సిలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అందులో ఒక మెడికల్ ఆఫీసర్ క్షేత్రస్థాయిలో ఉంటారని, మరొక మెడికల్ ఆఫీసర్ పిహెచ్‌ఎసిలో ఉంటారని చెప్పారు. మెడికల్ ఆఫీసర్లు ప్రతి నెలలో 26 రోజులు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తారని చెప్పారు. ప్రతి హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను నెలలో రెండుసార్లు డాక్టర్లు తనిఖీ చేస్తారని తెలిపారు. ప్రతి వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు డాక్టర్ అందుబాటులో ఉండి సేవలు అందిస్తారన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామాల్లో ఇంటి వద్దకు వెళ్లి వైద్యసేవలు అందిస్తారన్నారు. కుటుంబ డాక్టర్ విధానాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఒలు సుబ్రహ్మణ్యం, సుదర్శన్ బాబు, హెల్త్ వెల్నెస్ సెంటర్ సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరాపురం : రాష్ట్రంలోని ప్రతి పేదవానికి వైద్యం అందించాలన్నదే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫ్యామిలీ డాక్టర్ అనే పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ మంజువాణి ఎంపిపి ఈరన్న, వక్కలిగా కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని రంగి గౌడ్, జెడ్పీటీసీ స్వర్ణక్క నరసింహమూర్తి, సింగల్ విండో అధ్యక్షులు చిక్కన్న ఇతర వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవానికి వైద్యం అందించే పథకాన్ని రాష్ట్రంలో ప్రారంభించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల పరిధిలోని వేపరాల పంచాయతీలోని గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి జగన్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం గురించి వివరించారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారి ఉమామహేశ్వర్‌మారుతి, ఎంపీటీసీ జి సోమశేఖర్ రెడ్డి, స్థానిక సర్పంచి ఉమాదేవి వైద్యాధికారి బాబాఫక్రుద్దీన్. వైద్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఆసరాతో మహిళల ఆర్థికప్రగతి





మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న పుట్టపర్తి, పెనుకొండ ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

వైఎస్సార్ ఆసరా సాయం ద్వారా మహిళలు ఆర్థిక ప్రగతి బాట పడుతున్నారని పుట్టపర్తి శాసనసభ్యులు దద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక సాయి ఆరామం పక్కన డ్వాక్రా మహిళలకు మూడవ విడత ఆసరా రుణమాఫీ మెగా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట మేరకు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తున్నారని చెప్పారు. అందులో భాగంగా మూడో విడత ఆసరా నిధులు విడుదల చేశారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని సంక్షేమ పథకాలను వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజల కోసం అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పథకాల వర్తింపులో ఎలంటి వివక్ష చూపకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వర్తింపజేస్తున్నట్లు చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల చెందిన 19,273 మంది డ్వాక్రా మహిళలకు మూడవ విడత ఆసరా కింద మంజూరైన రూ.14,85,37,145 మెగా చెక్కును మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అమరాపురం : మహిళాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. వైఎస్ఆర్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని వైఎస్ఆర్ క్రాంతి పథకం కార్యాలయ ఆవరణంలో మహిళలకు ఆసరా పథకం ఎపిఎం తిమ్మప్ప అధ్యక్షతన ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు ఏరియా కోఆర్డినేటర్ ప్రసాద్, ఎంపీడీవో మునిస్వామి, జెడ్పీటీసీ స్వర్ణక్క నరసింహమూర్తి, ఎంపిపి ఈరన్న, వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని రంగే గౌడ్, క్రిస్టియన్ డైరెక్టర్ సుందర్ రాజు, సింగల్ విండో అధ్యక్షులు చిక్కన్న తదితరులు పాల్గొన్నారు: మండలంలో ఎనిమిది వందల తొంభై ఐదు సంఘాలకు గాను రూ. 7,43,77889ల లబ్ధి చేకూరిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కించప్ప, గడ్డం రాజు, మాజీ సర్పంచి ప్రసాద్ స్వామి, నారాయణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో వస్తేనే సంక్షేమ పథకాలు అమలు అవుతాయని ఎమ్మెల్యే పివి. సిద్ధారెడ్డి అన్నారు. స్థానిక గీత మందిరంలో గురువారం ఏర్పాటుచేసిన 3,వ విడత వైయస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ఎక్కడా వెనకడుగు వేయకుండా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శకుంతల, ఎంపీపీ రమణారెడ్డి, ఎపిఎం రమణమ్మ, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, సర్పంచి పంచరత్నమ్మ, ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, డాక్టర్ శంకర్, రాజప్ప, ఎంపీటీసీలు, సర్పంచులు, డ్వాక్రా సంఘాల మహిళలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పెనుకొండ : రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే శంకర్ నారాయణ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో వైఎస్ఆర్ ఆసరా మూడవ విడత సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులతో కలిసి ఎమ్మెల్యే శంకర్నారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ తదితరులు సిఎం జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గీతా రామ్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శివశంకరప్ప, వైసిపి నాయకులు శ్రీకాంత్ రెడ్డి, నాగలూరు బాబు, కృష్ణారెడ్డి, శ్యాం నాయక్, మునిమడుగు శ్రీనివాసులు, రాజగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మడకశిర ఎమ్మెల్యే

నేరాలు ఘోరాలు

కొండాపురంలో ఘర్షణ

బుక్కపట్నం : మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో పాతకక్షల నేపథ్యంలో ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో ముగ్గురు వ్యక్తులపై అదే గ్రామానికి చెందిన కొందరు కత్తులు, కర్రలతో దాడికి పాల్పడ్డారు. సోమవారం నాడు చోటు చేసుకున్న ఈ ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ రమణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... కొండాపురం గ్రామంలో కొంతకాలంగా ఇరువర్గాల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంద. ఈ నేపథ్యంలో రేషన్ బియ్యం సరిగా పంపిణీ చేయలేదన్న కారణంతో గురువారం సాయంత్రం గ్రామానికి చెందిన నల్లపురెడ్డి, మాధవరెడ్డి, మల్లేష్‌లపై అదే గ్రామానికి చెందిన మోహన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శివారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, చింతల్ రెడ్డి తో పాటు మరి కొంతమంది దాడికి పాల్పడ్డారు. కళ్లల్లో కారంచల్లి, కర్రలు కొడవలితో దాడికి చేశారు. ఈ దాడిలో నల్లపురెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వీరిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బుక్కపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో నల్లపురెడ్డి పరిస్థితి విషమించడంతో బెంగళూరు తరలించారు. ఘటనాపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఓబులదేవరచెరువు : మండల పరిధిలోని పగడాలవారిపల్లి సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యకి మృతిచెందాడు. లారీని వెనక వైపు నుండి ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. గౌనిపల్లి నుండి ద్విచక్ర వాహనంలో ఇద్దరు గోరంట్లవైపు వెళుతుండగా పగడాల వారి పల్లి వద్ద నిలబడిన లారీని వెనకవైపు నుండి ఢీకొంది. ఈ ప్రమాదంలో గొల్లవారి పల్లి చెందిన అంజి అక్కడికక్కడే మృతిచెందాడు. మరో వ్యక్తి గౌనిపల్లి బాబుకి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో మెరుగైన వైద్యం కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం టౌన్ : అప్పుల బాధతో ఓ చేనేత కార్మికుడు ఆత్మహత్యాయత్నాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం పట్టణంలోని శివనగర్‌లో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు శాంతినగర్‌కు చెందిన మహేష్ కూలి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈనేపథ్యంలో నేసిన చీరలకు గిట్టుబాటు ధర లేక అప్పుడు చేశారు. అప్పులు ఎలా తీర్చాలని రోజూ మనోవేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో శాంతినగర్‌లోని గ్యాస్ డౌన్ వెనుక పురుగుల మందు తాగి అపరస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు వెంటనే మహేష్‌ను ఆటోలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

హిందూపురం : హిందూపురం పట్టణంతో పాటు పరిగి తదితర ప్రాంతాల్లో ఆహార భద్రత అధికారిణి తస్లీమ్ గురువారం తనిఖీలు నిర్వహించారు. తూతూమంత్రంగా కొనసాగాయన్న విమర్శలు వినపడుతున్నాయి జిల్లాలోనే అతి పెద్ద పట్టణం హిందూపురం. ఇక్కడ వందలాది హోటళ్లు,ఐస్ పరిశ్రమలు, ఇతర ఆహార తయారీ పరిశ్రమలు ఉన్నాయి. ఆహార భద్రతా అధికారులు నిత్యం తనఖీలు నిర్వహించినప్పటికి కల్తీని అరికట్టడం సాధ్యం కాలేదు. ఈ నేపథ్యంలో ఆహార భద్రత అధికారిణి తస్లీమ్ గురువారం పరిగి, హిందూపురం పట్టణంలో పలు కూల్ డ్రింక్ షాపులు, ఐస్ తయారీ పరిశ్రమలను తనఖీ చేశారు. ఇందులో ఎఫ్ఎస్-ఎస్ఎఐ అనుమతులు లేవన్న కారణంతో నలుగురికి నిబంధనల మేరకు నోటీసులు ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఐస్ పరిశ్రమల్లో శుద్దనీటిని మాత్రమే ఉపయోగించాలని హెచ్చరించినట్లు తెలిపారు. అదే విధంగా జ్యూస్ తయారు చేసే వారు సైతం శుద్ద నీటిని ఉపయోగించాలని ఆదేశించామన్నారు. దీంతో పాటు ఆహార భద్రత చట్టం అనుసరించి అన్ని నిబంధనలు పాటించాలని హెచ్చరించామన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం


తనకల్లు : మండల పరిధిలోని సిజి ప్రాజెక్టు వద్ద ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో ఖాళీ సీట్ల భర్తీకి అర్హత కలిగిన బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ వెంకటేశ్వర నాయుడు కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 31వరకు ఆఖరి గడువు అని అన్నారు. ప్రవేశ పరీక్ష మేనెల 15వ తేదీన ఉంటుందన్నారు.

'యువగళం' విజయవంతం పట్ల హర్షం

కనగానపల్లి : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రాప్తాడు నియోజకవర్గంలో చేపట్టిన యువగళం పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆ పార్టీ మండల కన్వీనర్ యాతం పోతులయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమాలో ఆయన మాట్లాడుతూ పాదయాత్ర నియోజకవర్గంలో అడుగు పెట్టినప్పటి నుంచి భారీ స్థాయిలో గ్రామాల నుంచి ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారన్నారు. అంతేగాకుండా లోకేష్‌ను తమ ఇంటి మనిషి అనుకుని అపూర్వ ఆదరణ చూపారన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో తెలుగు యువత బట్ట సురేష్‌చౌదరి, ముకుందనాయుడు, ఎంపిటిసి బిల్లే భాస్కర్, పూజారి నాగభూషణ, రాజకృష్ణ, బిల్లే దాము, కసుమూర్తి వెంకటేష్, ములుగురు సంజీవ్, బీరన్న, లింగుట్ల సూరి, కార్యాకర్తలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆనంద సేప్ హోం ప్రారంభం

పుట్టపర్తి అర్బన్ : అనాధలు, అభాగ్యులు, ఒంటరి మహిళల జీవన విధానంలో మార్పు తీసుకురావడమే ముఖ్య ఉద్దేశంగా అనంద సేప్ హోంను ఏర్పాటు చేసినట్లు ప్రభాత్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు ఆర్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని కర్ణాటక నాగేపల్లి సమీపంలో ఆ సొసైటీ ఆధ్వర్యంలో ఆనంద సేఫ్ హోంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టిప్‌స్టంగ్ మరియు యాంజిల్స్ జాయ్ సహకారంతో ఈ సేఫ్‌హోంలో ఒంటరి మహిళలు, అనాధ బాలికలకు టైలరింగ్, కంప్యూటర్ తదితర రంగాలలో వారి నైపుణ్యత పెంచి వారి కాళ్లపై వారు మెరుగైన జీవితం సాగించే విధంగా చర్యలు చేపడతామన్నారు. ప్రారంభంలో 15 మంది మహిళలు 15 మంది బాలికలను తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో మౌనిక అన్నాముల్లర్, స్టిప్‌స్టంగ్, యాంజిల్ జాయ్ తదితరులు పాల్గొన్నారు.



ఆనందసేప్ హోం ప్రారంభ కార్యక్రమ దృశ్యం

'పది' పరీక్షల పరిశీలన

కొత్తచెరువు : పదో తరగతి పరీక్షలు సజావుగా నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బసంత్‌కుమార్ చెప్పారు. మండల కేంద్రంలోని బాలురు, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, శ్రీవిద్య పాఠశాలలో జరుగుతున్న 10వ తరగతి పరీక్షలను ఆయన పరిశీలించారు. జిల్లాలో 125 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయని, ఎలాంటి ఇబ్బంది లేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిట్టింగ్ స్క్వాడ్ గోపాల్ నాయక్, డిపార్ట్‌మెంట్ ఛీఫ్ చెన్నకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్

హిందూపురం : పదవ తరగతి పరీక్షలను జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి పరిశీలించారు. పట్టణంలోని బాలయేసు, నేతాజీ, అజీజియా, వెలంగణి మాతా పాఠశాలల్లో జరిగే పరీక్షలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు పట్టణంలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు తెలిపారు.

రొద్దం : మండలంలో మూడు సెంటర్లలో గురువారం నిర్వహించిన పదోతరగతి పరీక్షలు సజావుగా సాగాయి. పరీక్షా కేంద్రాలను తహశీల్దార్ అనంతచారి, ఎంపీడీవో రాబర్ట్ విల్సన్, ఎంఇఒ పరిశీలించారు.

నెలాఖరులోపు చిత్రావతి నదిపై రోడ్డు నిర్మాణ పనులు పూర్తి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండల పరిధిలోని అప్పరాచెరువు గ్రామ సమీపంలో సంఘమేశ్వర క్షేత్రం వద్ద చిత్రావతి నదిపై నిర్మిస్తున్న రోడ్డు, చెక్‌డ్యాం నిర్మాణ పనులను ఈనెలాఖరులోపు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈమేరకు గురువారం రోడ్డు కమ్ చెక్ డ్యాం నిర్మాణ పనులను పరిశీలించారు. సుమారు రూ.1.65 కోట్లతో ఆర్డీటీ సంస్థ సహకారంతో రోడ్డు నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జరుగుతున్న పనులను పరిశీలించి ఎకాలజీ అసిస్టెంట్ టెక్నికల్ డైరెక్టర్ మురళీనాథ్, ఆర్డీటీ ఎస్ఎంఎస్‌లు బాషా, గౌస్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈపనులను గతేడాదే ప్రారంభించినా వర్షాలు కురవడం వల్ల ఆలస్యంగా సాగుతున్నాయని ఎమ్మెల్యేకు వివరించారు. ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయని ఏప్రిల్ నెలాఖరిలోపు పనులు పూర్తి చేయాలని ఆర్డీటీ సిబ్బందిని ఆదేశించారు. ఈ నిర్మాణం పూర్తి చేసుకుంటే చిత్రావతి నది పరీవాహక ప్రాంతాల్లోని ఏడెనిమిది గ్రామాల ప్రజల రాకపోకలతోపాటు భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా చిత్రావతి నది పక్కనే ఉన్న చెన్నారాయపట్నం గ్రామానికి చెందిన వారు 200 ఎకరాలు నది అటువైపు ఉండడం వల్ల దారి లేక పంటలు సాగు చేయక బీళ్లు పెట్టుకున్నారన్నారు. అలాగే ఈ చెక్‌డాం నుంచి ద్వారా చెన్నరాయపట్నం, జ్వాలాపురం, కోడెకండ్ల, రామాపురం మీదుగా చిత్రావతి నది నీటితో ఉప్పర్లపల్లి చెరువు నింపవచ్చన్నారు. ఈకార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సంద్ర రామకృష్ణ, లింగమయ్య, రామచంద్ర, నారాయణస్వామితో పాటు పలువురు పాల్గొన్నారు.

అడవులు అగ్నికి ఆహుతి

పుట్టపర్తి రూరల్ : శ్రీ సత్య సాయి జిల్లా పరిధిలోని అడవులు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. పుట్టపర్తి, బుక్కపట్నం, నల్లమాడ, గోరంట్ల మండలాల్లో నాలుగు రోజుల నుండి అడవులు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. బుక్కపట్నం అటవీ రేంజ్ పరిధిలో అడవులు విస్తారంగా ఉన్నాయి. నాలుగు రోజుల క్రితం బుక్కపట్నం మండల పరిధిలోని బుచ్చయ్యగారిపల్లి సమీప పొలాల్లో నుండి అగ్ని కీలలు అడవిని చుట్టుముట్టాయి. బుక్కపట్నం మండలంలో పరిధిలోని బుచ్చయ్య గారి పల్లి, జానకంపల్లి, నార్సింపల్లి తదితర అటవీ ప్రాంతాల్లోకి వచ్చిన మంటలు పుట్టపర్తి మండలం వెంగళమ్మ చెరువు, కంబాలపర్తి అనుకొండ పాలెం, గ్రామాల పరిధిలోకి సోమవారం వ్యాపించాయి. ఆయా గ్రామాల పరిధిలో అడవుల్లో మంటలు వ్యాపించడంతో వేలాది ఎకరాల్లోని చెట్లు, వన్యప్రాణులు అగ్నికి ఆహుతి అయినట్లు గ్రామస్తులు తెలిపారు. అగ్నికీలలు గ్రామం వైపునకు రాకుండా ముందు జాగ్రత్త చర్యగా గ్రామస్తులు అప్రమత్తమై గడ్డివాములు, పండ్ల తోటలు, సంరక్షించుకున్నారు. గతంలో గ్రామంలో అటవీ సంరక్షణ కమిటీ సభ్యులు ఉండేవారిని అడవులు అగ్నికి ఆహుతి అవుతుంటే వారు వెంటనే స్పందించి మంటలు అదుపు చేసేందుకు చర్యలు తీసుకునేవారని చెప్పారు. అంతేకాక అటవీ అభివృద్ధి పనుల్లో భాగంగా అటవీ ప్రాంతంలో మంటలు ఒకవైపు నుండి మరొకవైపుకు వ్యాపించకుండా అదుపు చేయడానికి కందకాల తవ్వకాలు, రాతి కట్టడాల నిర్మాణాల పనులు చేపట్టేవారని తెలిపారు. అయితే అలాంటి అభివృద్ధి పనులు సరిగా చేయకపోవడంతో మంటలు వేలాది ఎకరాలకు వ్యాపిస్తున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. అటవీ అభివృద్ధి పనులకు లక్షలాది రూపాయలను ప్రతి సంవత్సరం ఖర్చు చేస్తున్నా ఎలాంటి ఫలితం లేదని పలువురు వాపోతున్నారు.